## సింగిల్ పేజీ కథ

# బాధ్యత

గంట నుంచి సిస్టర్స్ యిద్దరూ మాట్లాడుకుంటున్నారు. కానీ ఎవరూ పైకి తేలటం లేదు. ఎవరు ముందుగా కదిపితే వాళ్ళ మీదికి రెండో వాళ్ళు దాడి చేసే ప్రమాదముంది. తల్లి చూస్తూ కూర్చుంది. ఆమెకీ అసంతృప్తిగానే వుంది. చిన్న కూతురు బయటపడి 'అమ్మను నే తీసుకువెళ్తాను' అంటే బాగుండునని ఆమెకి. చిన్న కూతురంటే చాలా ప్రేమ ఆమెకి.

పెద్ద కూతురుకి కూడా చెల్లెలు బయట పడి 'అమ్మని నేను తీసుకువెళ్తా'నని అంటే బాగుండునని వుంది. ఎందుకంటే ప్రేమ ఎక్కడ వుంటే అక్కడ మనుషులు సర్దుకుపోతూ హాయిగా జీవిస్తారు. అదే ప్రేమ లేని చోట చిన్న విషయాల పట్ల కూడా అసంతృప్తి ప్రకటించి యుద్ధానికి దిగుతారు. ఆ విషయంలో అత్తగారి ద్వారా ఆమెకి అనుభవమే.

చిన్నకూతురికి తల్లి అంటే పెద్ద ప్రేమేమి లేదు. అవసరానికి తల్లి ప్రేమను ఉపయోగించుకుంటుంది తప్ప, తిరిగి అంతే ప్రేమను తల్లికి పంచే వ్యక్తి కాదు. అందుకే ముందు తను బయటపడితే తల్లి తన వెంట వచ్చేసి, ఎక్కువ కాలం తనింట్లోనే వుంటుందన్న భయం. అవసరమయితే చెరి ఆరు నెలలు అని అనవచ్చుననుకుంది.

పెద్దల్లుడు దూరంగా కూర్చుని వీళ్ళ కబుర్లు వింటూనే వున్నాడు. ఈ అనవసరపు సంభాషణ అతనికి విసుగును కలిగిస్తున్నది. అతనికి అత్తగారిని తమతో తీసుకువెళ్ళటంపై అభ్యంతరమేమీ లేదు. కూతురయినా, కొడుకయినా ముసలితనంలో తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత సంతానానికి వుందనుకున్నాడు.

చిన్నల్లుడూ అక్కడే కూర్చుని వున్నాడు. అత్తగారిని ఆహ్వానించటం అతనికి అసలు యిష్టం లేదు. అందుకే నిశ్శబ్దంగా వుండిపోయాడు.

''మీరసలు విషయం మానేసి అనవసరపు కబుర్లు చెప్పుకుంటున్నారు'' విసుగ్గా అనేశాడు పెద్దల్లుడు శంకరం.

ఒక్కసారి అందరూ నిశ్శబ్దమయిపోయారు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

''చూడండి'' అత్తగారి వంక చూస్తూ అన్నాడు ''మీకిక ఓపిక లేదు. ఎవరో ఒకరి దగ్గరికి వద్దామన్న ఆలోచనలో మమ్మల్ని పిలిపించారు. నిర్మొహమాటంగా చెప్పండి. మీకు ముందుగా ఎవరి వద్దకు వెళ్ళాలని వుంది?''

''నాదేముంది బాబూ'' చిన్న కూతురి వేపు చూస్తూ అంది ఆమె. ''ఎవరి దగ్గరికయినా నాకిష్టమే''

''మీరు మా వద్దకు వస్తామంటే నాకేమి అభ్యంతరము లేదు. అలాగే అతనికీ అభ్యంతరం వుండదనుకుంటాను''



''నాకేమీ అభ్యంతరం లేదు'' చెప్పాడు చిన్నల్లుడు.

మళ్ళీ అందరూ నిశ్శబ్దమయిపోయారు. శంకరానికి చిరాగ్గా వుంది. ఆమెకి ఎవరంటే యిష్టమో అందరికీ తెలుసు. ఆ చిన్నకూతురు మాట్లాడటం లేదు. ఎంతకాలమయినా ఈ సమస్య తెగదని అతనికి తెలుసు.

''అయితే మీరు మాతో వచ్చెయ్యండి'' మృదువుగా అన్నాడు. ''మీకిష్టమొచ్చినప్పుడల్లా చిన్నకూతురు దగ్గరికి వెళ్దురుగాని..''

ఆమెకి చిన్నకూతురి మీద కోపం వచ్చేస్తున్నది. '' రా అమ్మా'' అని ఒక మాట అనటం లేదు.

''మీరేమి సమాధానం చెప్పటం లేదు'' అన్నాడు శంకరం.

''నాదేముంది బాబూ..'' నసిగింది ఆమె.

''ఆమెను మాతో తీసుకువెళ్ళటం మీకేమన్నా అభ్యంతరమా?'' అడిగాడు తోడల్లుడని.

''మా కేమీ అభ్యంతరం లేదు'' నెత్తిమీద నుంచి ఎంతో బరువు దిగినట్లుగా ఫీలవుతూ అన్నాడు చిన్నల్లుడు.

''సరే'' అత్తగారి వేపు తిరుగుతూ అన్నాడు ''మీరు అన్నీ సర్దుకోండి. మంచిరోజు చూసుకుని బయల్దేరుదాం''

ఆ మాట అనేసి అక్కడినుంచి లేచి వెళ్ళిపోయాడు.

''బావగారికి అంత చిరాకేమిటి?'' నిష్ఠూరంగా అంది చిన్నకూతురు.

పెద్దకూతురు ఏమీ మాట్లాడలేదు. ఏమన్నా అంటే అది తగాదాకి దారి తీస్తుందని భయపడింది.

''ఇంకేం! బావగారు పిల్చారు కదా వెళ్ళు'' తల్లితోనూ అంత నిష్ఠూరంగానూ అని అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయింది చిన్నకూతురు. భార్యను అనుసరించాడు చిన్నల్లుడు.

ఇక పెద్దకూతురు, తల్లి మిగిలిపోయారు. తల్లిని చూస్తే జాలేసింది కూతురికి.

''ఈ నిర్ణయం నీకిష్టమేనా?'' మృదువుగా అడిగింది తల్లిని.

తల్లి మాట్లాడలేదు.

''నీ యిష్టానికి వ్యతిరేకంగా ఏమీ జరగదు చెప్పు''

''నాకు చిన్నదాని దగ్గరికే వెళ్ళాలని వుంది'' ఏడ్చేస్తూ అంది తల్లి.

''నాకు తెలుసు'' దీర్ఘంగా నిట్టూరుస్తూ అంది పెద్దకూతురు. ''కాని అదేమి మాట్లాడటం లేదు''

తల్లి సమాధానం చెప్పలేదు. నిశ్శబ్దంగా ఏడుస్తూ వుండిపోయింది. కూతురు ఆమెను ఓదార్చే ప్రయత్నమేమీ చేయలేదు. వాస్తవాన్ని తల్లి అంగీకరించక తప్పదు. కాని ఆమె అంగీకరించదు. చిన్నకూతురు తర్వాత ఏదో చెబుతుంది. అది నిజమని ఈ తల్లి నమ్మేస్తుంది. చిన్నకూతురి పట్ల వున్న అధికప్రేమ అలా నమ్మి తృప్తి పడేలా

చేస్తుంది. తల్లిని అలాగే వదిలేసి బయటికి వచ్చింది.

శంకరం వరండాలో నిలబడి వున్నాడు.

''నేనేమన్నా తప్పుగా మాట్లాడానా?'' భార్యను అడిగాడు.

తల అడ్డంగా వూపి అంది, ''మనం దురదృష్ట వంతులం''

''దేనికి?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''మీ అమ్మగారు మన మీద ప్రేమ లేకుండానే మన దగ్గర గడిపారు. ఇప్పుడు ఈవిడకీ మనమంటే ప్రేమ లేకుండానే మన దగ్గర వుండాల్సి వస్తున్నది''

''ఇది జీవితం'' నవ్వాడతను.

''కొద్దిపాటి ప్రేమను కూడా పొందలేకపోతు న్నామన్న బాధ..''

''నీ కొడుకులిద్దరి మీద నీకు సమానమయిన ప్రేమ వుందా?''

''ఆ!''

''గుండె మీద చేయి వేసి నిజం చెప్పు..''

నవ్వింది. ''నాకు పెద్దవాడి మీద కించిత్తు ప్రేమ ఎక్కువ''

''ఆ తేడా నీ జీవితాంతం వుంటుంది కదా! అదే జీవితం. అసలు ప్రేమ లేకుండా పోదుగా. నీ తల్లికీ అంతే. నీ మీద ప్రేమ కొద్దిగా తక్కువ. ఆ వాస్తవాన్ని ఒప్పుకొని ఆమె జీవితం ప్రశాంతంగా గడిచేలా చూడటం మన కర్తవ్యం. అంతవరకే నేను ఆలోచిస్తాను''

ఇద్దరి మధ్య నిశ్శబ్దం చోటు చేసుకుంది.

**-శ్రీగోపాల్ (సరిపల్లి)**

# తిరకాసు

సమయం సాయంత్రం ఆరుగంటల ముప్పై నిముషాలు కావొస్తోంది.

సీనియర్ ఏజెంట్ పద్మనాభం బజారుకు బయలుదేరుతుండగా ఏజెంట్ రాజారావు ఒక తన్ని పద్మనాభం ఇంటికి తీసికొచ్చాడు. అతని వయసు సుమారు ఏభై సంవత్సరాలుంటాయి.

''నమస్తే'' అన్నాడు రాజారావు.

''నమస్తే'' అంటూ ఇతనెవరని అడిగాడు పద్మనాభం.

''ఇతను పేరు సోమునాయుడు. స్కీంలో లక్ష రూపాయిలు డిపాజిట్ చేస్తానన్నాడు. మీరయితే వివరంగా చెబుతారని మీ దగ్గరకు తీసుకొచ్చాను'' అన్నాడు రాజారావు.

అన్ని విషయాలు పూస గుచ్చినట్లు చెప్పాడు పద్మనాభం సోమునాయుడికి.

టీ, టిఫిన్‌లు అయిన తరువాత పది రోజులలో కలుస్తానని అక్కడ నుంచి బయలుదేరాడు సోమునాయుడు.

అన్నమాట ప్రకారం సోమునాయుడు లక్ష రూపాయలు డిపాజిట్ చేసాడు. డిపాజిటర్ కమిషన్, ఏజెంట్ కమిషన్, సీనియర్ ఏజెంట్ కమిషన్ కూడా అనుకున్న ఒప్పందం ప్రకారం సోమునాయుడుకే యిచ్చివేసారు.

పద్మనాభం, సోమునాయుడుని స్కీంలో చేర్పించినందుకు ఉల్లాసంగా వున్నాడు.

రెండు నెలలు పోయిన తరువాత పద్మనాభం ఆఫీసుకు బయలుదేరుతుండగా సోమునాయుడుని తీసుకొని రాజారావు వచ్చాడు.

''ఏం, వచ్చారు?'' పలకరింపుగా అడిగాడు పద్మనాభం.


''ఏం లేదండి, సోమునాయుడు ఫలానా చిట్స్ అండ్ ఫైనాన్స్‌లో రెండు లక్షల చిట్ పాడేడట. ష్యూరిటీ సంతకాలు పెట్టమంటున్నాడు'' తాపీగా అన్నాడు రాజారావు.

ఆ మాటా, ఈ మాటా అయిన తరువాత ఇద్దరు సంతకాలు పెట్టడానికి ఒప్పుకున్నారు.

ఆ సొమ్ములో కొంత డిపాజిట్ చేయించవచ్చని పద్మనాభం లోలోపల అనుకున్నాడు.

సోమునాయుడుకి చీటీ సొమ్ము చేతికొచ్చిన తరువాత కొంత డిపాజిట్ చెయ్యమని కలిశారు పద్మనాభం, రాజారావులు. పది, పదిహేను రోజులు పోయిన తరువాత చెబుతానని వాళ్లను పంపించి వేశాడు సోమునాయుడు.

వాళ్ళైదుసార్లు తిప్పాడుగాని మళ్ళీ డిపాజిట్ చెయ్యలేదు సోమునాయుడు.



మూడు నెలలు పోయిన తరువాత పద్మనాభం ఇంటికి వచ్చాడు రాజారావు, సోమునాయుడుని తీసికొని.

''లక్ష రూపాయిల ఎఫ్.డి. బాండ్ పెట్టుకొని డబ్బులు అప్పు ఇవ్వమంటున్నాడు'' పద్మనాభంతో అన్నాడు రాజారావు.

''అదెలా అవుతుంది. అవదు'' అన్నాడు పద్మనాభం.

''అలా అయితే ఎఫ్.డి. క్యాన్సిల్ చేస్తానంటున్నాడు'' అన్నాడు రాజారావు.

కొంతసేపు తర్జన, భర్జన అయిన మీదట పద్మనాభం బాండ్ పెట్టుకొని ఎనభై వేలు యివ్వటానికి ఒప్పుకున్నాడు.

రెండు నెలల వరకు ఎటువంటి సమస్య లేకపోయినా తరువాత నుంచి చీటీ ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడం మానివేశాడు సోమునాయుడు. ఇప్పుడు కన్పించడమే మానివేశాడు.

అతని తాలూకా చిట్ ఇన్‌స్టాల్‌మెంట్స్ పద్మనాభం, రాజారావులు కడుతున్నారు.

లాభంకోసం చూసిన పద్మనాభం, రాజారావుకి అసలుకే మోసం వచ్చింది.

**-వైదా ఈశ్వరరావు (మింది)**